# కార్గోకు విస్తృత అవకాశాలు : సిఎం



ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ అధ్యక్షుడు సూన్ క్వోన్‌తో చంద్రబాబు బృందం

## సౌర విద్యుత్‌లో పనిచేసేందుకు ఓసిఐ ఆసక్తి

## ఉత్పాదక యూనిట్ల స్థాపనకు ఎల్‌జి సంసిద్ధత

## ముగిసిన చంద్రబాబు కొరియా పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ-చెన్నై, బెంగళూరు-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ల నుంచి జరిపే ఎగుమతుల ద్వారా ఎపిలో కార్గో వ్యాపారానికి విస్తృత అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా మూడో రోజైన బుధవారం ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, కియా మోటర్స్ నిర్వహించిన బిజినెస్ సెమినార్‌లో చంద్రబాబు ప్రసంగించారు. ఎపిలో పోర్టుల విస్తరణ, కంటైనర్ బిజినెస్‌కు ఉన్న అవకాశాల్ని వివరించారు. ఎయిర్‌పోర్టులు, రోడ్ నెట్‌వర్క్‌లు, అంతర్గత జల రవాణా, ఇండస్ట్రియల్ కారిడార్లు, ఎకనమిక్ జోన్లు, శ్రీసిటీ మొదలైనవన్నీ ఎపిలో కార్గో బిజినెస్‌కు సానుకూలాంశాలని తెలిపారు. కియా పెట్టుబడుల విస్తరణకు ఎపిను సరైన గమ్యస్థానంగా గుర్తించినట్లు ఆ సంస్థ ప్రెసిడెంట్ హూన్ వూ పార్క్ స్పష్టం చేశారు. ఎపిలో తమ పరిశ్రమకు అనుమతులు త్వరితగతిన పూర్తి చేశారన్నారు. భారత రాయబారి విక్రమ్ దొరై స్వామి మాట్లాడుతూ ఎపిలో ఉన్న అపార అవకాశాల్ని కొరియన్ పారిశ్రామిక వేత్తలు అందిపుచ్చుకోవాలన్నారు. కృష్ణపట్నం ఓడరేవుపై సెమినార్‌లో ప్రస్తావించారు. పోర్టు అభివృద్ధి పనులపై సిఇఒ అనిల్ మిగతా 9లో



# కార్గోకు విస్తృత అవకాశాలు : సిఎం

(మొదటి పేజీ తరువాయి)

ఎండూరి ప్రజెంటేషన్ ఇచ్చారు. బూసన్, కృష్ణపట్నం పోర్టుల అనుసంధానం గురించి వివరించారు. తొలుత ఒసిఐ కంపెనీ సిఇఒ వు హ్యూమ్ లీతో సిఎం భేటీ అయ్యారు. సౌర విద్యుత్తు రంగంలో వివిధ దేశాల్లో తమ సంస్థ జరుపుతున్న కార్యకలాపాల్ని హ్యూమ్‌లీ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భారత్‌లో కార్యకలాపాల్ని ప్రారంభించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. గతేడాది విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సుకు తాము హాజరయ్యామని గుర్తు చేశారు. సౌర విద్యుత్ రంగంలో ఎపిలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి కోరారు. సమావేశంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిమూ హియో, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సుంగ్ జూన్ కిమ్, టీమ్ మేనేజర్ జే వూక్ బేక్ తదితరులు పాల్గొన్నారు.

### ముందుగా ఎపిలోనే : ఎల్‌జి ప్రెసిడెంట్ క్వోన్

తయారీ రంగంలో కొరియా దాటి పూర్తి స్థాయిలో మరే దేశానికి వెళ్లలేదని, ముందుగా ఎపిలోనే పరిశ్రమ నెలకొల్పుతామని ఎల్‌జి ప్రెసిడెంట్ సూన్ క్వోన్ వెల్లడించారు. ఆయనతో సమావేశమైన ముఖ్యమంత్రి ఎపిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఇండియాలో ఇతర రాష్ట్రాల కంటే ఎపిలో ఉన్న అనుకూల పరిస్థితుల్ని ఎల్‌జి ప్రెసిడెంట్ సిఎంను అడిగి తెలుసుకున్నారు. వ్యాపార అనుకూలత కలిగిన రాష్ట్రాల్లో నెంబర్ వన్‌గా ఉన్నామని సిఎం వివరించారు. కియా మోటర్స్ ఎపిలో స్థిరపడిన విధానం, ఫాక్స్‌కాన్ తమిళనాడును వదిలి ఎపికి వచ్చి పనిచేస్తున్న వివరాల్ని సూన్ క్వోన్ దృష్టికి సిఎం తీసుకెళ్లారు. ఎపికి విస్తరించే ప్రతిపాదనను తమ బోర్డుతో చర్చిస్తామని, స్టోరేజ్ బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ఉందని సూన్ తెలిపారు.

### డార్క్స్ డైరెక్టర్‌తో భేటీ

దక్షిణ కొరియా అతిపెద్ద లాజిస్టిక్స్ సంస్థ డార్క్స్ డైరెక్టర్ బెన్నీ కాంగ్‌తో చంద్రబాబు సమావేశమయ్యారు. ఎపిలో ఏర్పాటు చేస్తున్న లాజిస్టిక్ యూనివర్సిటీలో భాగస్వామి కావాలని కోరారు. ఇందుకు తాము ఆసక్తిగా ఉన్నామని బెన్నీ వివరించారు. గ్రీన్ క్రాస్ సెల్ సంస్థ ఎండి లీ డక్‌జూతో చంద్రబాబు భేటీ అయ్యారు. సింగపూర్‌లో తమ ఉత్పత్తులు ప్రవేశపెట్టామని, తూర్పు ఆసియా దేశాల్లో వ్యాపారాభివృద్ధికి ఆసక్తిగా ఉన్నామని లీ డక్ జూ తెలిపారు. ముఖ్యమంత్రి బృందంలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, సిఎంఒ ముఖ్య కార్యదర్శి జి సాయి ప్రసాద్, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోకియా రాజ్, ఇడిబి సిఇఒ జాస్తి కృష్ణ కిశోర్, ఎపిఐఐసి ఎండి అహ్మద్ బాబు ఉన్నారు.

### నేడు అమరావతికి సిఎం

ముఖ్యమంత్రి బృందం దక్షిణ కొరియా పర్యటన బుధవారంతో ముగిసింది. గురువారం తెల్లవారుజామున చంద్రబాబు అమరావతికి చేరుకోనున్నారు.